క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన పోట్లూరు గ్రామ పంచాయతీ శివారు కృష్ణాపురం జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని వేల్పూరుకు చెందిన లోకయ్య, మస్తాన్‌వలీ స్వగ్రామం నుంచి వినుకొండకు వెళుతున్నారు. ఈ క్రమంలో వినుకొండ నుంచి నరసరావుపేట వెళుతున్న లారీ కృష్ణాపురం గ్రామ సమీపాన అదుపుతప్పి బైకును ఢీకొట్టంది. ఈ ప్రమాదంలో లోకయ్యకు కుడి కాలు విరిగిపోగా, మస్తాన్‌వలీకి స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో ఇద్దరిని నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

కనమర్లపూడిలో రూ.20 లక్షలతో పనులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పంచాయతీరాజ్ ఏఈ కొత్తగుండ్ల వెంకటేశ్వరస్వామి సోమవారం తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీలో రూ. 10 లక్షలతో 200 మీటర్ల వరకు సీసీ రోడ్లు పనులు ప్రారంభించామని చెప్పారు. మరో రూ.10 లక్షలతో బీసీ కాలనీలో 400 మీటర్ల వరకు సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులు పారదర్శకంగా చేశామని పేర్కొన్నారు.

నాటక రంగ కళాకారుడు నారాయణకు ఘన నివాళి



నరసరావుపేట ఈస్ట్: నాటక రంగ కళాకారుడు, నరసరావుపేట రంగస్థలి సభ్యుడు ఏ.ఎల్. నారాయణకు సోమవారం రంగస్థలి ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. బాల్యం నుంచి నాటకంపై మక్కువ కలిగిన నారాయణ పలు సాంఘిక, పౌరాణిక నాటకాల్లో నటించి రాణించారని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో రంగస్థలి ప్రతినిధులు ఎస్.ఎం. బాషా, కిలారి వెంకట్రావు, షేక్ బాజి, కె.ఆర్. ప్రసన్న కుమార్, గంధం యాజ్ఞవల్క్యశర్మ ఉన్నారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు సమీర ఎంపిక



శావల్యాపురం: జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఆకుమళ్ల సమీర ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం జాలాది శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు విద్యతో పాటు జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని తెలిపారు. ప్రకాశం జిల్లా చేవూరులో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో ఆకుమళ్ల సమీర ప్రతిభ చూపి ఎంపికై నట్లు చెప్పారు. తెలంగాణా రాష్ట్రంలోని మంచిర్యాలలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో సమీర పాల్గొననున్నట్లు పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి చెప్పారు. విద్యార్థిని సమీరను పేరెంట్ కమిటీ చైర్మన్ ముట్లూరి ప్రసాద్, ఉపాధ్యాయులు బి.వి. నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ , భువనేశ్వరి, నిర్మల, అబ్దుల్లా తదితరులు అభినందించారు.

నాటు సారా బట్టీపై పోలీసుల దాడి



బొల్లాపల్లి:మండలంలోని పలుకూరు తండా సమీపంలోని పొలాల్లో నాటు సారా బట్టీపై దాడి నిర్వహించినట్లు బండ్లమోటు ఎస్ఐ జె.బలరాంరెడ్డి సోమవారం తెలిపారు. 25 లీటర్ల నాటు సారా స్వాధీనంతో పాటు 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. దాడి సమయంలో బట్టీ వద్ద ఎవరూ లేరని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

శిక్షణ పొందుతున్న ఏడుగురు డ్రైవర్ల రక్తదానం

నరసరావుపేట: ఆర్టీసీ డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న ఏడుగురు అభ్యర్థులు రక్తదానం చేసినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి సోమవారం వెల్లడించారు. నరసరావుపేట, వినుకొండ డిపోల పరిధిలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తులు నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులో గల ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్నారు. వారికి రక్తం అవసరం కావడంతో తమ డిపో ఆవరణలో నిర్వహిస్తున్న ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందే జి.రాజేష్, షేక్ ఎం.జాని, ఎం.పవన్, షేక్ బాబావలి, బి.శ్రీకాంత్, ఎం.గణేష్, ఎం.శివ శంకర్‌రెడ్డి రక్తదానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమాన్ని డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ప్రజలతో మమేకమవ్వాలి

గృహ సారథులు, కన్వీనర్లకు మంత్రి రజిని దిశానిర్దేశం



మెటీరియల్ పంపిణీ చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, నాయకులు

నాదెండ్ల: వచ్చే సాధారణ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసి సంక్షేమ పాలన మరింత చేరువ చేసేందుకే గృహ సారథులు, కన్వీనర్లు పని చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని నాదెండ్ల, అమీన్‌సాహెబ్ పాలెం, అప్పాపురం, ఇర్లపాడు, కనపర్రు, ఎండుగుంపాలెం, సాతులూరు గ్రామాలకు చెందిన గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు సోమవారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ప్రచార మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి ఎప్పటికప్పుడు మండల సచివాలయాల కన్వీనర్‌కు సమాచారం ఇచ్చిపుచ్చుకునేలా ఉండాలని సూచించారు. తాను ప్రతి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన సమయంలో ప్రభుత్వానికి అపూర్వ స్పందన లభించిందని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతాన్ని మూడన్నరేళ్లలో పూర్తి చేసిన ప్రభుత్వం మనదని చెప్పారు. గృహ సారథులు, కన్వీనర్లు ప్రతి గృహాన్ని సందర్శించి వారితో మమేకంకావాలని ఆమె సూచించారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, నాదెండ్ల సొసైటీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, నాయకులు మద్దూరి కోటిరెడ్డి, మంగు ఏడుకొండలు, అప్పాపురం సుభాని, అంకిరెడ్డి, ఉడతా వెంకటేశ్వర్లు, గద్దె ఆంజనేయులు, కె. రామకృష్ణ, వింధ్యారాణి, బ్రహ్మయ్య, ఎంపీటీసీ సభ్యులు గుడికందుల యల్లారావు, కుంభా అంకమ్మ, దావల ఏసమ్మ పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే బొల్లా
- 13,14 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల):గతంలో ఎన్నడూ లేని విధంగా గడప గడపకు తిరిగి, సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. వినుకొండ పట్టణంలోని 13, 14 వార్డుల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు ప్రజలు తమకు ప్రభుత్వం అందించిన పథకాలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వినుకొండ అభివృద్ధిని గత ప్రభుత్వంతో పోల్చి చూసుకోవాలని సూచించారు. గత పదేళ్లలో వినుకొండ వెనుకబడిన ప్రాంతంగానే ఉందని, కనీసం తాగునీరు అందించలేని స్థితిలో మున్సిపాలిటీ ఉందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాలు తాగునీటి సమస్యను అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలు ట్యాంకర్ల పేరుతో దండుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం వినుకొండలో బిందెల సంస్కృతిని రూపుమాపామని, రానున్న రోజుల్లో 24 గంటలు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 13, 14 వార్డుల్లో రైలు కట్ట వెంబడి మురుగునీరు నిలబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించి రూ.80లక్షల నిధులతో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించిన ఘనత తమకే దక్కుతుందని వివరించారు. ముఖ్యమంత్రి సభకు సుమారు లక్ష మంది ప్రజలు వినుకొండ వస్తే ఎక్కడా ట్రాఫిక్ లేకుండా సభ విజయవంతమైందని, రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రజాసమస్యలను పరిష్కరిస్తుంటే మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోర్టుల్లో కేసులు వేసి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపల్ కాంప్లెక్స్‌లు, ఎన్ఎస్‌పీ కెనాల్‌పై సీసీ రోడ్లు, ఘాట్‌రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డుతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. అభివృద్ధి చేయడం చేతకాని చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం అలజడులు సృష్టించి కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించేందుకు కుట్రపన్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలనను చూస్తే కరువు కాటకాలే గుర్తుకువస్తాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కాలంలో సకాలంలో వర్షాలు పడి పాడిపంటలతో రైతులు ఆనందంగా ఉన్నారని చెప్పారు. నాగార్జున సాగర్ గేట్లను 16 సార్లు ఎత్తిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. లోకేష్ పాదయాత్ర వల్ల చంద్రబాబుకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఎవరు, ఎన్ని విధాలా అడ్డుపడినా వినుకొండ అభివృద్ధిని ఆపలేరని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే దిల్షాద్, 14వ వార్డు కౌన్సిలర్ జయరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పీఎస్ ఖాన్, వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్‌ఖన్నా, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, ఎంఎస్‌కే బాషా, నంది నరసింహారావు, సానాల పుల్లయ్య, గర్రె శ్రీనివాసరావు, ఎం.ఎల్.రెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, మాజీ ఎంపీపీ ములకా రామతులసీరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: కడుపునొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనపల్లి వెంకటేశ్వర్లు(79) పట్టణంలోని రజకకాలనీలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గత కొన్ని రోజులుగా ప్రకాశం జిల్లా గొల్లపూడిలో రెండో కుమార్తె వద్ద ఉంటూ ఆదివారం రాత్రి పట్టణానికి తిరిగి వచ్చాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో రాత్రి కడుపునొప్పి భరించలేక రేకులషెడ్డులోని తన ఇంటిలో ప్లాస్టిక్ వైరుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం కరెంట్ బిల్లు తీసే వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చా వేదిక

నరసరావుపేట ఈస్ట్: ప్రతి నెలా ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాలులో సోమవారం సాయంత్రం పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగుల జీతభత్యాలు–చట్టబద్ధత–మార్గదర్శకాలు అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు స్వర్ణచినరామిరెడ్డి, కార్యదర్శి ఎస్.రవి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, నరసరావుపేట తాలూకా అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.ఫ్లోరెన్స్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణోత్సవం

నరసరావుపేట రూరల్: పాలపాడులోని శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలువురు దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ ధర్మకర్త యక్కంటి సుబ్బారెడ్డి, సభ్యులు కొలిశెట్టి వెంకటేశ్వర్లు, గాదె పెద్దిరెడ్డి, కుంచాల శివ వెంకట్రావు, వై.ధర్మరావు పర్యవేక్షించారు.

బిడ్డలతో తల్లి ఆత్మహత్య సంఘటన దురదృష్టకరం



ఘటన స్థలంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: పెద్దచెరువు మహాలక్ష్మి నగర్‌లో ఇద్దరు కుమారుల సహా ఉరి వేసుకుని తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దురదృష్టకరమని ఎమ్మెల్యే గోపిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఘటన స్థలాన్ని సందర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కాకుమాను మంగపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ మీరావలి ఉన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- మైదవలులో గడపగడపకు కార్యక్రమం
- పార్టీ నాయకులతో కలసి పాల్గొన్న మంత్రి



నవరత్నాల కరపత్రాలు అందించి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పారదర్శకమైన రాష్ట్రంలో పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. యడ్లపాడు మండలం మైదవోలులో సోమవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన మంత్రి రజినీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి ఆడపడుచులాగా స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని పోలేరమ్మ అమ్మవారు శివాలయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, నిరీక్షణ ప్రార్థన మందిరంలో ప్రార్థనలు చేశారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలతో కలసి ఇంటింటికీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి రజిని ప్రతి గడపకు వెళ్లారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇప్పటివరకు కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరాలను తెలియజేసే కరపత్రాల్ని అందిస్తూ, ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంకా సమస్యలు ఏమైనా ఉన్నాయా? అంటూ స్థానికుల్ని అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరత్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతోందని, ఆయా పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమం, అమలయ్యే ప్రతి పథకాన్ని ఎంతో పారదర్శకంగా అందిస్తున్నామని చెప్పారు. రాబోయే కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే మరో మారు జగనన్నను ఆశీర్వదించి ముఖ్యమంత్రి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ మానుకొండ వీరారెడ్డి, పార్టీ నాయకులు ఘంట శంకర్, పి.దయాసాగర్, రాచమంటి చింతారావు, గౌరు హనుమంతరావు, రాజేష్, రవికుమార్, సర్పంచ్ లక్ష్మయ్య, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, కో -ఆప్షన్ సభ్యులు షేక్ గౌస్ సందాని, కె. శామ్యూల్ పాల్, ఏ. శ్యామ్ పాల్,ఎంపీటీసీ సభ్యుడు కీర్తి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

కొండగురునాథుని స్వామికి ఎమ్మెల్యే బొల్లా పూజలు



వినుకొండ(నూజెండ్ల):మండలంలోని రవ్వారంలో ఉన్న శ్రీ కొండగురునాథుని స్వామి తిరునాళ్లలో సోమవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభల పైనుంచి ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

కాపు యువసేన జిల్లా ఉపాధ్యక్షుడిగా రవికిరణ్



నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లా కాపు యువసేన ఉపాధ్యక్షుడిగా కంచుపర్తి రవికిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాపు యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కర్ణా శ్రీనివాసరావు నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. జిల్లాలోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రవికిరణ్ తెలిపారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: మండలంలోని జంగాలపల్లెలో కొలువైయున్న సీతారామాంజనేయస్వామి, వేణుగోపాలస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు వాసు, సురేష్ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం వైభవంగా కల్యాణంతో పాటు ఆలయం ప్రాంగణంలో శాంతి హోమం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులకు అన్నదానం చేశారు. గ్రామ సర్పంచ్ బత్తుల సీతారామిరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాత్రికి హరేరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

స్కూల్ గేమ్స్‌లో సంకురాత్రిపాడు విద్యార్థుల సత్తా



త్రోబాల్ విజేతలతో హెచ్ఎం, ఉపాధ్యాయులు



నెట్‌బాల్ పోటీల్లో విజేతలతో..

నాదెండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో జరిగిన పలు పోటీల్లో సంకురాత్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గత నెల 21 నుంచి 23వ తేదీ వరకూ నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14 నెట్‌బాల్ పోటీల్లో ఎం. నిహారిక, వి. వినీత, ఎస్‌కే. అనూష, అండర్-17లో టి.థెరిస్సా, ఎం. హర్షిత, జె. వైష్ణవి, యు. ప్రసన్నలక్ష్మి, పి.ఎల్.సీహెచ్.ఎస్. ఆర్. రాజేశ్వరి పాల్గొన్నారు. గత నెల 28, 29, 30 తేదిల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన త్రోబాల్ అండర్- 14 విభాగంలో టి. శశికిరణ్, కె. సంతోష్, కె. తేజవెంకట్, కడపలో అండర్- 17 విభాగంలో జరిగిన పోటీల్లో జె. సంజయ్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం విద్యార్థుల్ని హెచ్ఎం కె. సాంబశివరావు, పీడీ వై. బాలజ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

వాలీబాల్ పోటీల విజేత ఎన్‌ఈసీ కళాశాల



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: ఆటల పోటీలు యువతకు స్ఫూర్తినిస్తాయని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల (ఎన్‌ఈసీ) చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. కళాశాల క్యాంపస్‌లో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. జిల్లా స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఎన్‌ఈసీ కళాశాల ప్రథమ, జేఎన్‌టీయూ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీ పోటీల్లో ఎన్‌ఈసీ కళాశాల ప్రథమ, నరసరావుపేట ఫార్మసీ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. లాంగ్ జంప్‌లో గోర్లె వాసుదేవరావు, చింతపల్లి ధనుష్, మహిళల లాంగ్ జంప్ విభాగంలో గుబ్బల దివ్యశ్రీ, కె.శ్రీలక్ష్మి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. షాట్‌పుట్ బాలుర విభాగంలో తాళ్లూరి శివ, లక్కరాజు ప్రశాంత్, మహిళల విభాగంలోయడవల్లి అనూష, కె.శ్రీలక్ష్మి, 100 మీటర్ల పరుగులో ఈ.జగదీష్, చింతపల్లి ధనుష్, మహిలల విభాగంలో శ్రీలక్ష్మి, సింధుశ్రీ, టెన్నీకాయిడ్‌లో మౌనిక, శ్రీలక్ష్మి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి ఎన్‌ఈసీ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.అనిల్, ఎడ్యుకేట్ ది సొసైటీ అధ్యక్షుడు షేక్ బాజి షాహిద్ అన్సారి, పీడీలు కృష్ణారెడ్డి, రూన్సీరాణి, రాజేంద్ర పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్‌లో అగ్ని ప్రమాదం



చిలకలూరిపేట టౌన్: ప్రమాదవశాత్తు పొగాకు బ్యారెన్ అగ్నికి ఆహుతైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మండలంలోని బొప్పూడి గ్రామం పరిధిలో పూసల సీతమ్మ పొగాకు బ్యారన్ నిర్వహిస్తుంటారు. ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు దానికి నిప్పు అంటుకుంది. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటల్ని అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో రూ. 2లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపకశాఖ అధికారులు అంచనా వేశారు.

బేస్‌బాల్ టోర్నీలో సీఆర్ జట్టుకు ప్రథమ స్థానం



జట్టుతో యాజమాన్యం చుండి వేణుగోపాల్ తదితరులు

నాదెండ్ల: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 3,4 తేదీల్లో జరిగిన అంతర్ కళాశాలల బేస్‌బాల్ టోర్నమెంట్‌లో శ్రీ చుండి రంగనాయకులు కళాశాల జట్టు ప్రథమ స్థానం స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారుల్ని కళాశాల పాలక మండలి సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, అధ్యక్షుడు విజయసారథి, ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, పీడీ నాగేంద్ర విద్యార్థుల్ని అభినందించారు.జాతీయ పోటీల్లో సత్తా చాటి కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

యూనివర్సిటీ జట్టుకు ఐదుగురి ఎంపిక

టోర్నమెంట్‌లో ప్రతిభ చాటిన కళాశాల విద్యార్థులైన బి. సతీష్, బి. సాగర్‌బాబు, ఎం. సతీష్, ఎ. కుమారబాబు, ఎం. వేణు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 14–18 వరకూ అస్సాంలో జరిగే ఆలిండియా యూనివర్సిటీల టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట



విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట చేస్తున్న హిమాలయ గురువు

వినుకొండ టౌన్: పట్టణంలోని పాత మార్కెట్ బజార్, శివాలయం పక్కన ఉన్న చలివేంద్ర ఆంజనేయస్వామి దేవస్థానం పునఃప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు సోమవారం విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట, మండప దేవత పూజలు, అనుష్ఠానాలు, పంచామృతవాసం కార్యక్రమాల్ని హిమాలయ గురువు చేతుల మీదుగా నిర్వహించినట్లు ఆలయ అభివృద్ధి, పునఃనిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానంలో గణపతి, సుబ్రహ్మణ్య, సతీసమేత నవగ్రహ, శిఖర కలశ ప్రతిష్టను వేద పండితుడు అవ్వారి ఉమాశంకర దీక్షితులు శర్మ, ఆలయ అనువంశిక అర్చకుడు, జ్యోతిష వాస్తు సిద్ధాంతి చంగవల్లి వెంకట శ్రీరామచంద్రబాబు శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పూజలు ఐదు రోజుల పాటు జరుగుతాయని, ఈ నెల 9న యంత్ర స్థాపన, విగ్రహ, శిఖర ప్రతిష్ఠలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి, పునః నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. చివరి రోజు భక్తులకు అన్న సంతర్పణ జరుగుతుందని తెలిపారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం



జి. ప్రసాద్



డి.రవికుమార్

శావల్యాపురం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)శావల్యాపురం మండల నూతన కార్యవర్గం నియామకం జరిగినట్లు గౌరవ అధ్యక్షుడు సీహెచ్. నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. అధ్యక్షుడిగా గూడ్లూరి ప్రసాద్ (ఎంపీపీ స్కూలు, శానంపూడి) సహ అధ్యక్షుడిగా ఎ.వసంతరావు (జెడ్పీ ఉన్నత పాఠశాల, పోట్లూరు) మహిళా సహ అధ్యక్షురాలిగా ఎస్.సీతామహాలక్ష్మి (పోట్లూరు), ట్రెజరర్‌గా టి.శ్రీనివాసరావు (ఎంపీపీ స్కూలు, శావల్యాపురం) ప్రధాన కార్యదర్శిగా దేసబోయిన రవికుమార్ (ఎంపీపీ స్కూలు, కనమర్లపూడి), ఆడిటర్‌గా ఎస్‌కే.చిన కరిముల్లా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి డి.రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యల్ని ప్రభుత్వ సత్వరమే పరిష్కరించాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com